క్లుప్తంగా

మున్నూరుకాపు సంఘం భవనానికి నిధులు



రాజ్యసభ సభ్యుడు రవిచంద్రతో జోగు రామన్న, తుల శ్రీనివాస్

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని మున్నూరుకాపు సంఘం భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ. 10 లక్షల నిధులు కేటాయించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌లు ఆయన్ను కలిసి విన్నవించగా, నిధులు కేటాయించారు. నిధులు కేటాయించినందుకు రవిచంద్రతోపాటు సహకరించిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన మహేష్‌కుమార్ గౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అంబకంటి అశోక్, కాంగ్రెస్ ఆదిలాబాద్ మండల అధ్యక్షుడు సంజయ్ దూబే, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

మాల సంక్షేమ సంఘం మండల కమిటీ..

నేరడిగొండ: మాల సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్క మహేందర్, ఉపాధ్యక్షుడిగా మద్దెల నారాయణస్వామి, గౌరవ అధ్యక్షుడిగా అనుపట్ల సంజీవ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మద్దెల అడెల్లు, కోశాధికారిగా కుర్మె నారాయణస్వామి, సభ్యులుగా ద్యావంత్ లక్ష్మణ్, బొబ్బిలి నాగన్న, అశోక్, నవీన్, అనిల్, భాస్కర్, గంగారాం, శ్రీనివాస్, నరేశ్, సాగర్ ఎన్నికయ్యారు. కాగా, నేరడిగొండ గ్రామ అధ్యక్షుడిగా చిప్పరి రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఆయా గ్రామాల మాల సంఘాల సభ్యులు సన్మానించారు. జిల్లా నాయకులు సుభాష్, ప్రేమ్‌సాగర్ తదితరులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ఆర్థిక సాయం చేసి.. మానవత్వం చాటి..



ఆర్థికసాయం చేస్తున్న రూపేశ్‌రెడ్డి

బేల: పుట్టిన పదిహేను రోజులకే తల్లిని కోల్పోయిన మండలంలోని దుబ్బగూడ పంచాయతీలోని టెమ్రిగూడ గ్రామానికి చెందిన నవజాత శిశువుకు యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆర్థికసాయం చేశారు. శిశువు పాల డబ్బాల కోసం సోమవారం రూ. 3 వేల నగదు అందించి మానవత్వం చాటారు. ఆయన వెంట ప్రమోద్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

శిశువుకు అంత్యక్రియలు



శిశువును అంత్యక్రియల కోసం తీసుకెళ్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఓ శిశువుకు అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చింది. కుమురంభీం జిల్లా లింగాపూర్ మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మడావి సక్కుబాయి–గోవింద్‌లకు నాలుగు రోజుల క్రితం మగ శిశువు జన్మించాడు. సోమవారం ఆ శిశువు మరణించడంతో అంత్యక్రియల కోసం బంధువులు, స్నేహితులకు సంప్రదించినా ఎవరు ముందుకు రాలేదు. ఈ విషయం తెలుసుకున్న సొసైటీ అధ్యక్షుడు అజీజ్ మానవత దృక్పథంతో ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

సిరికొండ: మండలంలోని సూర్యపేట్ గ్రామానికి చెందిన గర్భిణి జంగుబాయి(22) ఆదివారం రాత్రి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. పురిటినొప్పులతో బాధపడుతున్న ఆమెను కుటుంబీకులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు మెరుగైన వైద్యం కోసం ఇచ్చోడలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చినట్లు ఈఎంటీ సురేశ్, పైలెట్ గోపినాథ్ తెలిపారు.

వరద వస్తే ఆగాల్సిందే..



కప్పర్ల సమీపంలో లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు.

- లోలెవల్ వంతెనలపై నుంచి ప్రవహిస్తున్న వరద
- తగ్గే వరకు గంటల కొద్ది నిరీక్షిస్తున్న వాహనదారులు
- చర్యలు చేపట్టని అధికారులు

తాంసి: వర్షం కురిస్తే చాలు లోలెవల్ వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించి గంటల కొద్ది వాహనాల రాకపోకలు అంతరాయం కలుగుతుంది. వరద ఉధృతి తగ్గే వరకు గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోంది. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్ నుంచి కరంజి(టి) వరకు ఉన్న అంతరాష్ట్ర రహదారిపై పలు చోట్ల లోలెవల్ వంతెనలు, కల్వర్ట్‌లు ఉన్నాయి. ఆయా గ్రామాల మధ్య గతంలో నిర్మించిన లోలెవల్ వంతెనలతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో తరుచుగా రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. జందాపూర్ నుంచి కరంజి(టి) వరకు ఉన్న అంతరాష్ట్ర రోడ్డుపై తాంసి మండలంలోని సావర్గాం, పిప్పల్ కోటి సమీపంలో, కప్పర్ల ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న లోలెవల్, నిపాని సమీపంలో ఉన్న లోలెవల్ వంతెన, ధనోర, గోన సమీపంలో లోలెవల్ వంతెన, వడూర్ సమీపంలో, అంతర్గాం సమీపంలో ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అందర్‌బంద్ సమీపంలోని లోలెవల్ కల్వర్ట్‌పై నుంచి వరదనీరు ప్రవహించడంతో గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.

తప్పని తిప్పలు..

కొద్దిపాటి వర్షానికే మండలంలో ఆయా గ్రామాల మధ్య నిర్మించిన వంతెనలపై నుంచి వరదనీరు ప్రవహించడంతో అంతరాష్ట్ర రోడ్డుపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామాల మధ్య రాకపోకలకు వరదనీరు పూర్తిగా తగ్గేంత వరకు అంతరాయం ఏర్పడుతుంది. రోడ్డు కూడా సింగిల్‌గా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరద ప్రవాహం తగ్గేంత వరకు వాహనదారులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో నిర్మించిన లోలెవల్ వంతెనలు శిథిలావస్థకు చేరాయి. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి అంతర్రాష్ట్ర రోడ్డుపై ఆయా గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనల రోడ్డు నిర్మాణం చేపట్టే సమయంలో వరద ప్రవాహాలకు తగ్గట్లు నిర్మించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

వర్షం కురిస్తే అంతే..



గంట పాటు ఏకధాటిగా వర్షం కురిస్తే ఆయా గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వరద వచ్చిందంటే గంటకు పైగా నిరీక్షించాల్సి వస్తోంది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఉంది. – రుద్ర విలాస్, అర్లి(టి)

వంతెనలు నిర్మించాలి



మండలంలో అంతర్రాష్ట్ర రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. అంతర్రాష్ట్ర రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. రోడ్డు పనులతో పాటు వంతెనల ఎత్తు పెంచి నిర్మాణం చేపట్టాలి. – నరేశ్ రెడ్డి, కరంజి

అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని యాపలగూడ గ్రామంలో సోమవారం ఆయన మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘ నాయకులు విఠల్, కిష్టాయ్య, శ్రీనివాస్, సంతోష్, గంగారెడ్డి, జయరాం, దయాకర్, విజయ్, తదితరులు ఉన్నారు.

టెండర్లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు ఆశన్న

ఎదులాపురం: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు ఇచ్చేలా పిలిచిన టెండర్లను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకుడు ఆశన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో సోమవారం కార్మిక సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మిక శాఖ సంక్షేమ బోర్డు ద్వారా అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. కానీ ఇప్పుడు దాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేలా టెండర్లను పిలుస్తుందన్నారు. దాన్ని రద్దు చేయాలని తీర్మానం చేశామని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం జేఏసీ పని చేస్తుందన్నారు. ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు కిరణ్, ఆశన్న, సుభాష్, నితిన్, జగన్, వాసు, దేవిదాస్, నర్సింగ్, వెంకట్రావ్, హన్మండ్లు, సుమన్, వామన్ పాల్గొన్నారు.

గణేశ్ లడ్డూ వేలం

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని రామాలయంలో ప్రతిష్ఠించిన గణపతి లడ్డూకు సోమవారం వేలం పాట నిర్వహించారు. పలువురు ఈ వేలంలో పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ కౌడాల మహేందర్ రూ.60 వేలకు లడ్డూ దక్కించుకున్నాడు. ఆలయకమిటీ సభ్యులు మహేందర్‌ను సన్మానించారు.

బోథ్‌లో..

బోథ్: మండలంలోని సూర్యనగర్ గ్రామంలోని సూర్య గణేశ్‌మండలి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రిటైర్డ్ పీజీహెచ్‌ఎం ధరావత్ గుండెరావ్ రూ.20 వేలకు దక్కించుకున్నారు. రెండవ లడ్డూను హరిచంద్ రూ.8 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులను నిర్వాహకులు సన్మానించారు.

హిందీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

ఆదిలాబాద్: హిందీ భాష సేవా సమితి ఆధ్వర్యాన జెడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 20న నిర్వహించే జిల్లాస్థాయి హిందీ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే కోరారు. జిల్లాకేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో సోమవారం వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సమితి సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల పదోన్నతి పొందిన 100 మంది హిందీ టీచర్లను సన్మానించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన, పాటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమానికి హిందీ భాషాభిమానులు, కవులు, రచయితలు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ, ఉపాధ్యక్షుడు సాంబన్న, శ్రీహరి, చంద్రశేఖర్, జావిద్ అలీ, భాస్కర్, రమేష్, గణేష్, శ్రీనివాస్, భీమ్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలో సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కూర పొచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా కాంబ్లే లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా రాచర్ల నారాయణ, కోశాధికారిగా మోర వెంకట్, గౌరవ అధ్యక్షుడిగా సూర్యవంశం నాందేవ్, జిల్లా కార్యదర్శులుగా రాథోడ్ మదన్‌లాల్, గేడం నాగోరావు, మహిళా కార్యదర్శిగా అనురాధ, సభ్యులుగా భాగ్యవతి, శ్రీకాంత్, అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెంటపర్తి ఊశన్నను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు పొంగుల వెంకట్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భీమయ్య, రమేశ్, ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యలకు పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కుమార్ జనతా గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన భారీ వినాయకుని విగ్రహం వద్ద ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఓం గణేశ్ మండలి వినాయకున్ని దర్శించుకున్నారు. గణేశ్ నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. బీజేపీ నేతలు లాలామున్న, దినేష్ మటోలియా, ఆదిత్య ఖండేశ్కర్, నిర్వాహకులు ఉన్నారు. పలు కాలనీల్లో ప్రతిష్ఠించిన వినాయకుల వద్ద మాజీ మంత్రి జోగు రామన్న పూజలు చేశారు. ఆర్అండ్‌బీ వసతి గృహం వద్ద ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ అసోసియేషన్ వినాయకుని నిమజ్జనోత్సవంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: నిర్మల్ జిల్లా భైంసా సమీపంలో పాలాజ్ కర్ర వినాయకుడిని కుటుంబ సభ్యులతో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుతో కలిసి పూజలు చేశారు. 75 ఏళ్లుగా పూజలందుకుంటున్న గణనాథుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు అనిల్ జాదవ్‌ను ముథోల్ ఎమ్మెల్యే సన్మానించారు. ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్‌రెడ్డి, నాయకులు దేవేందర్‌రెడ్డి, అభి, ధనరాజ్ ఉన్నారు. అదేవిధంగా నేరడిగొండలోని రామ్‌నగర్‌లో గణనాథుడికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన గణపతుల వద్ద ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సోమవారం పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. తర్వాత ఎమ్మెల్యే స్థానికులతో కలిసి భోజనం చేశారు. పలుచోట్ల గణేశ్ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. రాత్రి ఏమాయికుంట గురుదేవ్ చెరువులో నిమజ్జనం చేశారు. ఉట్నూర్ సీఐ మొగిలి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో గల రుద్ర గణేశ్ మండలి వద్ద దుర్గం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. చైర్మన్ దుర్గం శేఖర్ పాల్గొన్నారు.

బోథ్: గ్రామాల్లో గణేశ్ మండపాల వద్ద అన్నదాన నిర్వహించారు. మండల కేంద్రంలో భగత్ సింగ్ చౌక్ గణేశ్ మండలి వద్ద అల్లకొండ పోతన్న, ఫినిషింగ్ గణేశ్ మండపం వద్ద మాజీ ఎంపీటీసీ రజియా బేగం అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్సై ప్రవీణ్, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో 9 రోజులు భక్తులతో పూజలందుకున్న వినాయకుడిని సోమవారం రాత్రి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్‌లోని వినాయక్‌చౌక్ వద్ద కాషాయ రంగు తోరణాలతో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పంచాయతీ భవనం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద శోభాయాత్రకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ నగేశ్, జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బీజేపీ జాతీయ నాయకుడు రితేశ్ రాథోడ్, డీఎస్పీ నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకురాలు సుగుణ స్వాగతం పలికారు. కూడలిలో చేరుకున్న గణనాథులు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చాయి. శోభాయాత్రలో ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులు నృత్యాలు చేశారు. గణనాథులను ఊరేగింపుగా లక్కారం జీపీ పరిధి గంగన్నపేట చెరువులో నిమజ్జనం చేశారు. డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

నిమజ్జనోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం

ఆదిలాబాద్: హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శిశు మందిర్ నుంచి మంగళవారం వినాయక నిమజ్జన శోభాయాత్రకు హాజరుకావాలని మాజీ మంత్రి జోగు రామన్నకు సమితి అధ్యక్షుడు హన్మాండ్లు సోమవారం ఆహ్వాన పత్రిక అందించారు. ఈ ఆయన వెంట సమితి సభ్యులు ఉన్నారు.

బీర్సా సంఘర్ష్ సంఘర్ష్ క్రాంతి దళ్ అధ్యక్షుడిగా సురేష్

ఆదిలాబాద్‌రూరల్: బీర్సా సంఘర్ష్ క్రాంతి దళ్ తెలంగాణ అధ్యక్షుడిగా కినక సురేష్ నియమించినట్లు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు దశరథ్ మడావి తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దశరథ్ మాట్లాడారు. బీర్సా సంఘర్ష్ క్రాంతి దళ్ ఆదివాసీల హక్కుల సాధన కోసం కృషి చేస్తుందన్నారు. జాతీయ మహిళా సంఘర్ష్ అధ్యక్షురాలు గిరిజ తాయి ఉయికే, నాయకులు గేడం దీపక్, కుర్సేంగే యాదవ్ రావ్, పెందూర్ మోహన్ పాల్గొన్నారు.

జయంతి ఉత్సవాలు విజయవంతం చేయండి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించే విశ్వకర్మ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు పడకండి కిష్టయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 17న ప్రతిష్ఠాపన, 18న శోభాయాత్ర, అనంతరం మహా ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. కులస్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సాయుధ పోరాట వారోత్సవాలు

ఎదులాపురం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76 వారోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి హాజరై జెండాను ఆవిష్కరించారు. పోరాట వీరుల త్యాగాలను గుర్తు చేసుకుని, వారి త్యాగాలను కొనియాడారు. రాష్ట్ర సమితి సభ్యురాలు నళినిరెడ్డి, నాయకులు కుంటాల రాములు, షేక్‌పాషా, రమేశ్, అమీనాబేగం, కాంతాబాయి పాల్గొన్నారు.

తాంసిలో..

తాంసి: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి సీపీఐ జిల్లా నాయకుడు చిలుక దేవిదాస్ సోమవారం పార్టీ జెండా ఆవిష్కరించారు. మండల నాయకులు రతన్, సతీశ్, అశోక్, అరుణ్ ఉన్నారు.

మెరుగైన విద్యనందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సంతోష్

నార్నూర్(గాదిగూడ): గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం కేజీబీవీని సందర్శించి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆదివాసీ సంఘాల నాయకులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

సిరికొండ: గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని లక్మంపూర్ గ్రామంలో ఆయన ఆదివారం రాత్రి గణేశ్ మండపం వద్ద పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

గణేశ్ మండపం వద్ద ముగ్గుల పోటీలు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశ్ మండపం వద్ద సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి మౌన శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ముగ్గులు వేశారు. అంతకుముందు వినాయకుడి వద్ద పూజలు నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలతో జూడాల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతా ఘటన నేపథ్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రిమ్స్ జూనియర్ డాక్టర్లు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డాక్టర్లు అన్వేష్, అభినయ్, ప్రత్యూష, ప్రసన్న, శ్యామ్ తదితరులు ఉన్నారు.

22న టాలెంట్ టెస్ట్

బోథ్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు భగత్‌సింగ్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు మాత్రమే ఈ టెస్ట్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. టెస్టుకు పరీక్ష ఫీజు లేదని తెలిపారు. వివరాలకు సెల్ 83093 30699 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేఆర్కే కాలనీ మాల సంఘం కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని కేఆర్కే కాలనీ మాల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఆ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా భగవండ్లు, అధ్యక్షుడిగా ద్యావంత్ రమేశ్, జనరల్ సెక్రటరీగా సూరం అనిల్, కోశాధికారిగా నిమ్మల కృష్ణ, ఉపాధ్యక్షుడిగా గోడే పోచ్చన్న, జాయింట్ సెక్రటరీగా రాగం సంజీవ్, సభ్యులుగా రంగా, కిశోర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు శాలువా కప్పి సత్కరించారు.

నేడు జాతీయ పతాకావిష్కరణ

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పతాకావిష్కరణ ఉంటుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బోథ్: మండలంలోని మర్లపెల్లి శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి ఆరుగురు పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 15,950ల నగదును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నంలో సోమవారం మిలాద్ ఉన్ నబీ ఘనంగా నిర్వహించారు. మసీద్‌లో ఉదయం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు.

సన్మానం

బోథ్: మండల కేంద్రంలోని లోకమాన్య యూత్ గణేశ్‌మండలి సభ్యులను కాలనీవాసులు సోమవారం సన్మానించారు. గత 16 ఏళ్లుగా మట్టి గణపయ్యనే ప్రతిష్ఠించి పూజలు నిర్వహించి నిమజ్జనాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా సభ్యులను కాలనీవాసులు సత్కరించారు.

నీటికుంటలో పడి బాలిక మృతి



సంజన మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న గజ ఈతగాళ్లు

బజార్‌హత్నూర్: నీటికుంటలో పడి బాలిక మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అప్పారావ్ కథనం ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి కల్వల్ భారత్ తన భార్య సంగీత ఇద్దరు కుమార్తెలు కాలేశ్వరి, సంజన (12)తో బతుకుదెరువు కోసం పిప్రి గ్రామానికి వచ్చారు. గ్రామ సమీపంలోని స్టోన్ క్రషర్‌లో భార్యభర్తలు పనిలో చేరారు. సోమవారం మధ్యాహ్నం కాలేశ్వరి తన చెల్లె సంజన (12)తో కలిసి బట్టలు ఉతకడానికి స్టోన్ క్రషర్ వద్ద నీటికుంట వద్దకు వెళ్లారు. ఆ సమయంలో సంజనకు ఫిట్స్ రావడంతో కుంటలో పడిపోయింది. బయటికి తీయడానికి కుటుంబీకులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సైతో కలిసి సీఐ రమేశ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి సంజన మృతదేహాన్ని బయటకు తీశారు. తండ్రి భారత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోటళ్లు, వ్యాపార సంస్థలు మూసి ఉంచాలి



మాట్లాడుతున్న గంద్రత్ సంతోష్

ఎదులాపురం: వినాయక నిమజ్జనోత్సవం శోభాయాత్ర సందర్భంగా వ్యాపార సంస్థలు, హోటళ్లు మూసి ఉంచాలని కిరాణా మర్చంట్ అసోసియేషన్ సంఘం ప్రతినిధి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ తెలిపారు. జిల్లా కేంద్రలలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడు కమల్ కిశోర్ అగర్వాల్, గోవింద్ దోమకొండ వార్ పాల్గొన్నారు.